

# స్నేహితుడు

ఆంధ్రభూమి వీక్లీ.. 27 డిసెంబర్, 2001

విక్టరీ థియేటర్ ముందు చరణ్, బాలు, విజయ్ నిలబడి ఉన్నారు.

"ఈరోజు నిజంగా సంధ్య సినిమా కొస్తుందంటావా?" అనుమానంగా అడిగాడు చరణ్.

"అందులో అనుమానమే లేదు. నీ సంధ్య ఈ సినిమాకే వస్తుంది" విజయ్ అన్నాడు.

"నువ్వు చెప్పరా బాలూ... సంధ్య వస్తుందా, రాదా?" చరణ్ అడిగాడు.

"అదెలా చెప్పగలనురా..? వస్తే రావచ్చు- రాక పోనూ వచ్చు!" అన్నాడు బాలు.

"అందుకే నీలాంటివాళ్ళని 'గోపి' అనేది!" విజయ్ అన్నాడు.

"'గోపి' అంటే..?"

"గోపి' అంటే... గోడ మీది పిల్లి!" చరణ్ చెప్పాడు.

"అయితే మీరిద్దరూ గోకుల్!" బాలూ అన్నాడు.

"గోకుల్ అంటే!" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"ఏం లేదులే! మీకు విశ్వాసం చాలా ఎక్కువ అని చెప్పాను."

అరనిమిషం తర్వాత అర్థమైంది- అతనన్న మాటకు అర్థం ఏమిటో! ఇద్దరూ కోపంగా బాలూ పైకి రాబోయారు. అంతలో బాలు "అదిగో... సంధ్య!" అనటంతో అటు చూశారు.

నిజంగానే సంధ్య మరికొంతమంది స్నేహితురాళ్ళతో వచ్చింది.

వీళ్ళని చూసి నవ్వుతూ "హలో... మీరూ సినిమాకే వచ్చారా?" అని అడిగింది.

"కాదు... సెలూన్‌కి!" చిన్నగా అన్నాడు బాలు.

మిత్రులిద్దరూ అతనివైపు కోపంగా చూశారు.

"ఎవరి కోసం వెయిట్ చేస్తున్నారు?" సంధ్య అడిగింది.

"ఫ్రెండ్ కోసం!" తడబడుతూ చెప్పాడు చరణ్.

"గర్ల్‌ఫ్రెండ్స్!" చిన్నగా అన్నాడు బాలు.

చరణ్ అతనివైపు కోపంగా చూసి సంధ్యతో-

"మీరెళ్లి కూర్చోండి... మేము తర్వాత వస్తాం!" అన్నాడు.

వాళ్ళు వెళ్ళిన అయిదు నిమిషాలకు ముగ్గురు మిత్రులూ వాళ్ళు కూర్చున్న వెనుక వరుసలో సెటిలయ్యారు.

తెరపై అడ్వర్‌టైజ్‌మెంట్స్ వేస్తున్నారు.

ఏదో టూత్‌పేస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్ వస్తోంది.

"రామూకి పళ్ళనొప్పి అంటేనే తెలియదు. ఎందుకంటే..."

"రామూకి పళ్ళే లేవు!" పూర్తిచేశాడు బాలు.

అతని జోక్‌కి అమ్మాయిలు పడీపడీ నవ్వసాగారు.

తర్వాత సోపు కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంట్ వచ్చింది.

"ప్రతిరోజూ వాడండి... సుప్రీమ్ సబ్బు!"

"వాడితే మీ ఒళ్ళంతా గబ్బుగబ్బు!" అదే కంఠస్వరంతో అన్నాడు బాలు.

మళ్లీ ముందువరస అమ్మాయిలు నవ్వసాగారు.

అమ్మాయిల ముందు బాలు ఎక్కువ మార్కులు కొట్టేయడం చూసి అసూయ కలిగింది విజయ్‌కి. తనూ ఏదైనా జోక్ వేయాలని క్రిందకి వంగి వెతుకుతున్నట్లు నటించసాగాడు.

"ఏరాఁ... ఏమైనా... పడిపోయిందా?" బాలు అడిగాడు.

"ఏంలేదురా! అమ్మాయిలు నవ్వుతున్నారు కదా... నవరత్నాలేమైనా రాలాయేమో- ఏరుకుందామని!"

"ఏరుకో నాయనా! కానీ, మరీ అలా ముందుకు వంగి ఏరకు. అమ్మాయిలకు తగిల్తే నీ చెంప పగిలి పళ్ళు రాల్తాయి. మళ్లీ 'విజయ్‌కి పళ్ళనొప్పి అంటేనే తెలియదు. ఎందుకంటే...' అని ఆ టూత్‌పేస్ట్ వాళ్ళు చెప్పాల్సివస్తుంది."

అమ్మాయిలు మళ్లీ నవ్వసాగారు ఈ జోక్‌కి.

ఇంతలో... సినిమా మొదలవడంతో అందరూ సినిమాలో లీనమైపోయారు.

ఇంటర్వెల్‌లో అందరికీ కూల్‌డ్రింక్స్ తెచ్చిచ్చాడు చరణ్.

అది చూసిన బాలు చాలా బాధపడ్డాడు. చరణ్ తల్లిదండ్రులిద్దరూ చిన్నఉద్యోగాల్లో ఉన్నారు. ఎంతో కష్టంతో అతన్ని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. కాని, చరణ్ సంధ్య మోజులో పడి డబ్బునీ, చదువునీ నాశనం చేసుకుంటున్నాడు.

రాత్రి హాస్టల్‌లో భోజనాలయ్యాక బాలు అన్నాడు-

"ఒరేయ్ః చరణ్! సినిమా పేరుతో ఈ రోజంతా పుస్తకం పట్టలేదు నువ్వు. రా... కొద్దిసేపైనా చదువుకుందాం!"

"సారీరా... నాకిప్పుడు చదివినా బుఱ్ఱ కెక్కదు. రేపటినుంచీ చదువుకుంటాను. ఈరోజుకి నన్ను వదిలెయ్ః!" అంటూ ముసుగుతన్ని పడుకున్నాడు చరణ్.

మనసులోనే బాధపడుతూ పుస్తకం తీసుకొని చదువుకోసాగాడు బాలు.

• • •

**నా**లుగు రోజుల తర్వాత తమ లెక్చరర్ పెళ్ళి రిసెప్షన్‌కి వెళ్లాడు బాలు, అతని మిత్రులు.

అక్కడ అందరూ బలవంతం చేస్తే బాలు- 'నువ్వు వస్తావని...' సినిమాలోని 'కలలోనైనా కల గనలేదే... నువ్వు వస్తావని!' పాట పాడాడు.

తర్వాత బఫే డిన్నర్‌లో భోంచేస్తున్న బాలూ దగ్గరికి వచ్చింది సంధ్య.

"కంగ్రాచ్యులేషన్స్ బాలుగారూ... అద్భుతంగా పాడారు పాట!"

"థాంక్స్!"

"ఇంతకీ... ఎవరో ఆ దేవత?"

"ప్రస్తుతానికి ఎవరూ లేరు."

"అంటే... భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉందా?"

"ఎందుకు లేదు? కాకపోతే- ముందు చదువు పూర్తవ్వాలి. మంచి ఉద్యోగం దొరకాలి. తర్వాతే ప్రేమైనా, పెళ్ళైనా! ఏ వయసులో చేయాల్సింది ఆ వయసులో చేయాలన్నది నా అభిప్రాయం!"

"గుడ్! నేనూ మీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. ఇంతకీ... మీరింత బాగా పాడినందుకు మీకు 'ట్రీట్' ఇవ్వాలనుకుంటున్నాను. చెప్పండి- ఎక్కడికి పోదాం... హోటల్? ...సినిమా??"

"నిజంగా మీరు నాకు ట్రీట్ ఇవ్వదలచుకుంటే నేనే ఒకటి కోరుతాను... తీరుస్తారా?"

"చెప్పండి..."

"చరణ్‌పై మీ అభిప్రాయ మేమిటి?"

"అతనిపై అభిప్రాయం ఏర్పరచుకునేటంత స్నేహం నాకు అతనితో లేదు. హిఈజ్ మై క్లాస్‌మేట్... అంతే! చెప్పాగా... మీ అభిప్రాయాలే నా అభిప్రాయాలని! చదువయ్యాకే ప్రేమ, పెళ్ళి... వగైరాలు!"

"అయితే- ఈ విషయం చరణ్‌కి వీలైనంత త్వరగా చెప్పండి. అతడు మీ ధ్యాసలో పడి చదువుని నిర్లక్ష్యం చేస్తున్నాడు. మీరు హర్ట్ కాకండి. ఇందులో మీ తప్పేం లేదు. వాళ్ళ తల్లిదండ్రులు ఇద్దరూ సంపాదిస్తేనేగాని వాళ్ళకు నెల గడవదు. ఎంతో కష్టంతో ఇతన్ని చదివిస్తూంటే... ఇతనేమో- సినిమాలకని, షికార్లకని డబ్బును వేస్ట్ చేస్తున్నాడు. అందుకే మీకీ రిక్వెస్ట్! అయితే మీరు కోపంతో

కాకుండా నెమ్మదిగా చెప్పాలి. వాడు మళ్లీ ఎలాంటి అఘాయిత్యం చేసుకోకూడదు కదా! మీరు భవిష్యత్తులో కూడా అతడ్ని ఒక స్నేహితుడిగా గౌరవిస్తానని, సన్నిహితంగా ఉంటానని చెప్పండి. ఆపైన అతని దృష్టి చదువు వైపు దృష్టి మళ్లేలా నేను చేస్తాను. నిజానికి చరణ్ చాలా బ్రిలియంట్!"

"తప్పకుండా బాలుగారూ! మీ స్నేహితుని గురించి ఇంతగా ఆలోచిస్తున్నారంటే రియల్లీ యూ ఆర్ గ్రేట్! నేను హోటల్‌కో, సినిమాకో పిలిస్తే పరుగెత్తుకుంటూ వస్తారు మన కాలేజీ మగపిల్లలు! యు ఆర్ డిఫరెంట్... ఈరోజు నుంచీ నేనూ మీ క్లోజ్‌ఫ్రెండ్‌ని!"

"థాంక్యూ... థాంక్యూ వెరీమచ్!" మనసులోని టెన్షన్ తొలగిపోతూండగా సంతోషంగా అన్నాడు బాలు.

• • •

**యూ**నివర్సిటీ సెకండ్ వచ్చిన చరణ్‌ని గట్టిగా కౌగలించుకున్నాడు బాలు.

"కంగ్రాట్స్ చరణ్... ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ!"

"ఈ విజయం నాది కాదురా బాలూ... నీదే! ఇందాకే సంధ్య ఫోన్ చేసింది. నీవు నాకోసం ఎంత బాధపడ్డావో చెప్పింది. సంధ్య ద్వారా నన్ను మంచిదారిలో పెట్టావు. స్నేహితులు అందరికీ దొరుకుతారు. కానీ, నీలా బాధ్యత తెలిసిన స్నేహితుడు ఎంతమందికి దొరుకుతాడు? నేను చాలా అదృష్టవంతుణ్ణిరా బాలూ!" కళ్ళనీళ్లతో అన్నాడు చరణ్.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం
**జయంతి పబ్లికేషన్స్**
రూపొందించిన సరికొత్త పథకం గురించి మీకు తెలుసా?
ఇంకా తెలీదా..!
అయితే వెంటనే చివరిపేజీల్లో చూడండి-
మీకే తెలుస్తుంది..!

